# కుక్కబుద్ధి

## శంకరమంచి పార్థసారధి

లాయరు వినాయకరావు భోజనంపూర్తి చేసి, వాకింగ్ నెపం పై వీధిలో కొచ్చారు.

ఆయనకి లాయరుగా మంచి ప్రాక్టీసుంది. అందుచేత రెండు చేతులా సంపాదనవుంది. సిటీకి నడిబొడ్డునరెండు అంతస్థులభవనంవుంది ఇవికాక, ఒకకారు, ఇద్దరు భార్యలు, ముగ్గురు, పిల్లలు రెండో భార్య కింకా భాగ్యంకల్గలేదు) కూడా వున్నారు.

ఆయన ప్రతిరోజు రాత్రి ఎనిమిదింటి కల్లా మరుసటి రోజు కేసుల వివరాలన్నీ ఒక్కసారి చూసుకుని, భోజనం పూర్తి చేసి, అనింద్యుడి లాంటి అల్సేషన్ కుక్కని చేత్తో పుచ్చుకుని, వాకింగుకని ఇంట్లో చెప్పి, చిన్నింటికి బయలుదేరు తాడు

అసలు చిన్నిల్లంటూ స్థాపించు కున్నది గూడ ఇటీవలనే. తన వద్దకొచ్చిన ఆస్థి తగాదా కేసుని చాకచక్యంగా నిర్వహించి భర్త లేని భానుమతికి ఆస్థి సంక్రమించేలా జేసేరు. అక్కడితో లాయరుగా తనపని పూర్తయినా, వినాయకరావుగా ఇంకా పని మిగిలున్నట్లు, సలహాలు సంప్రదింపుల నెపంతో చేరువయ్యి. ఆమెని దారిలోకి మళ్ళించుకున్నారు. ఆమెకి ఒక ఫ్లాటు కొనిచ్చి అప్పటినుంచి మంచి చెడ్డా చూడసాగేరు.

ఆయనకి తన ఇంటి నించి భానుమతి ఫ్లాటుకి ఇరవైనిముషాల నడక. దారి పొడుగునా అనేక మంది ఆయనేకి విష్ చేస్తుంటారు. వాటినన్నిటిని చిరునవ్వుతో స్వీకరిస్తు, అల్సేషన్‌తో అలా ముందుకు సాగిపోతుంటే ఎంతో గర్వంగా, హుందాగా వుంటుందాయనకి.

ఆ రోజు ఇస్త్రీలుంగీ, తెల్లటి లాల్చి ధరించారు నోటినిండా కిళ్ళి, ఒకచేతిలో కుక్కని బంధించిన గొలుసు, రెండో చేతిలో రాజు ప్రమాణపు [కింగ్ సైజు] సిగిరెట్టులతో మహరాజులా సాగి పోతున్నారు భానుమతి ఫ్లాటు ఇంకా పది గజాలుంది-

అంతలో..........

ఆయన చేతిలో వున్న అల్సేషన్ దృష్టి, ఆ ప్రక్కగా చెత్తకుండీప్రక్కన కడుపు నింపుకుంటున్న ఆ వీధి కుక్క పై పడింది. వెంటనే బలంగా గుంజుకుని, మొరుగుతూ దానివైపుగా పరిగెత్తింది. పరాకు చిత్తగిస్తున్న వినాయకరావు తేరుకునే సరికి గొలుసుతో సహా అల్సేషన్ ఆవీధి కుక్క పైబడి కుమ్మేస్తోంది.

ఆయన తెల్ల మొహం పెట్టి వెర్రిగా చూస్తున్నాడు.



వీధి కుక్క భయంతో పరిగెత్తింది. దాన్ని వెంటాడుతూ అల్సేషన్ ఒక క్షణంలో రెండూ కనుచూపు కందకుండా మాయమైనాయ్.

అప్పటికేమిగతా ఫ్లాట్సులోని పాత్రికేయులు జరుగుతున్న పార్సుని పరమానంద భరితంగా చూస్తు ఇటీవలి టి.వి ప్రోగాముల కన్నా ఇదే బావుందన్న నిర్ణయాని కొచ్చేస్తున్నారు.

వినాయకరావు చాలా యిబ్బందిగా ఫీలయ్యి ఏం చెయ్యాలో తెలీక, మెల్లిగా




భానుమతి ఫ్లాటులో కెళ్ళి తలుపు మూసేరు....

ఒక గంట తర్వాత, వినాయకరావు బయటి కొచ్చి గృహాన్ముఖులైనారు. పదడుగులువేసి దూరాన కన్పిస్తున్న దృశ్యాన్ని చూసి అలాగే నిల్చుండి పోయారు. గంటక్రితం అరుచుకుని, కొట్లాడుకుని, కుమ్ములాడుకున్న వీధి కుక్క, అల్సేషన్లు చాలా సామరస్యంగా దూరాన్నుంచి వస్తున్నాయ్. ఇంతకు మునుపటి ద్వేషం, వైరం, కన్పించక పోగా స్నేహం, అప్యాయత తృప్తి గమనించి ఆయన విసుగ్గా మొహం చిట్లించారు.

వీధి కుక్క కుండీ చాటుకి తప్పుకుంది అల్సేషన్ యజమాని దగ్గర కొచ్చి, ఆయన పాదాలు నాకుతూ నిల్చుంది.

వినాయకరావుకి అది చేసిన గూండా పని అర్థమైంది. దాని మెడకున్న ఇనుప గొలుసుని తిరిగి చేతిలోకి తీసుకుంటూ, "వెధవ కుక్క బుద్ధి పోనిచ్చుకున్నావు గాదు" అంటూ దాన్ని బలంగా డొక్కలో ఒక తాపు తన్నేరు అది బాధ పట్ట "కుయ్యో కుయ్యో" మంది

దాని కుయ్యో మొర్రోలకికవీశ్వరు లెవరైనా భాష్యం చెప్పగల్గితే ఆయన పరిస్థితి ఏమయ్యేదో ఏమోమరి!

కాని అటువంటి ప్రమాదం సంభవించనందున ఆయన తిరిగి బింకంగా, హుందాగా, గౌరవంగా, అల్సేషన్ సమేతుడై ఇందిదారి పట్టేరు. ○